క్లుప్తంగా

విజేతలకు బహుమతుల పంపిణీ



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీజీఎం

అద్దంకి: విద్యార్థులంతా ప్రకాశం పంతుల్ని ఆదర్శంగా తీసుకోవాలని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా విశ్రాంత డీజీఎం కాకరపర్తి మారుతీరావు అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల విజేతలకు ప్రశంస పత్రాలు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, చిన్ని మురళీకృష్ణ, వీరవల్లి సుబ్బారావు, సందిరెడ్డి శ్రీనివసరావు, ప్రకాశం మిత్రమండలి అధ్యక్షుడు, గాడేపల్లి దివాకరదత్తు, అన్నంనేని వెంకట్రావు, అనీలకుమారి సూరి, తదితరులు పాల్గొన్నారు.

విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ



పత్తి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ మోహనరావు

ఇంకొల్లు (చినగంజాం): పంటలో తెగుళ్ల నివారణ కోసం రైతులు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలని పర్చూరు వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్ మోహనరావు అన్నారు. మండలంలోని పావులూరు గ్రామంలో వ్యవసాయాధికారి పీ వేణుగోపాల్ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మోహనరావు గ్రామంలోని మినుము, పత్తి పంటను పరిశీలించారు. అనంతరం ఆయన రైతులనుద్దేశించి మాట్లాడుతూ మినుము పంటలో తెగుళ్లను నివారించేందుకు బీజామృతంతో విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ వినయ్‌కుమార్, అభ్యుదయ రైతులు వెంకటరావు, నాగరాజు, రమేష్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సెక్యూరిటీ కట్టుదిట్టంగా ఉండాలి..

ప్రభుత్వ ఆసుపత్రి వద్ద పోలీసు సెక్యూరిటీ కట్టుదిట్టంగా ఉంచాలి. పట్టణ ప్రాంతాల కంటే గ్రామీణ ప్రాంతాలలో నేరాలు ఎక్కువగా జరిగే అవకాశాలు ఉంటాయి. రాత్రి సమయాల్లో ప్రభుత్వ ఆసుపత్రి, పీహెచ్‌సీల వద్ద నైట్ సిబ్బంది ఉంటారు. వారికి విశ్రాంతి గదులు ఉండవు, సరైన భద్రత కూడా కరువే. ఇలాంటి సమయాల్లో ఆకతాయిలు, నేరస్తులు వస్తుంటారు. ప్రొటెక్షన్ లేకుంటే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ గడుపుతుంటారు.

– జీ అనూష, ఎంఎల్‌హెచ్‌పీ, కొడవలివారిపాలెం





నైట్ పెట్రోలింగ్ చాలా అవసరం..

గ్రామాల్లో పోలీసు నిఘా పటిష్టపరిచి, నైట్ డ్యూటీ సిబ్బందికి భద్రతగా ఉండాలి. పోలీసు వ్యవస్థను మరింత అప్రమత్తం చేసి గ్రామాల్లోను, పట్టణాల్లోనూ పోలీసు పెట్రోలింగ్‌ను పటిష్టంగా నిర్వహించాలి. రాత్రి సమయాల్లో పోలీసులు నిఘా ఉంటున్నారా లేదా అని ఉన్నతాధికారుల పర్యవేక్షణ కూడా అవసరమే. ప్రాణాలు కాపాడే వైద్యుల పట్ల కూడా నేర చరిత్ర కలిగిన అనేక మంది దాడులు చేయడం హేయమైన చర్య.

– పీ అశ్విని, ఎంఎల్‌హెచ్‌పీ, స్వర్ణ

మృత్యు రహదారి



బైపాస్ రోడ్డులో వేగంతో వచ్చి పల్టీ కొట్టిన కారు (ఫైల్)



బైపాస్ రోడ్డు చల్లారెడ్డిపాలెం వద్ద లారీ ఢీకొన్న ఘటనలో మృతి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి (ఫైల్)

- ప్రాణాలు తీస్తున్న అతివేగం
- విషాదం నింపుతున్న రోడ్డు ప్రమాదాలు
- యువకుల మరణాలతో తల్లిదండ్రులకు గుండె కోత
- వేటపాలెం బైపాస్ రోడ్డు జంక్షన్ వద్దనే ఎక్కువ ప్రమాదాలు

వేటపాలెం: జాతీయ రహదారులు మృత్యువులకు ఆవాసాలుగా మారతున్నాయి. దీనికి తోడు వాహనదారుల అతివేగం కారణమవుతోంది. చిన్న నిర్లక్ష్యాలే పెద్ద ప్రమాదాలకు కారణమవుతున్నాయి. మితిమీరిన వేగం యువత ప్రాణాలు తీస్తోంది. కుటుంబానికి ఆసరాగా నిలుస్తారనుకున్న యువకులు వేగం మోజులో పడి ప్రాణాలు కోల్పోతున్నారు. యువకులపై తల్లిదండ్రులు గంపెడాశలు పెట్టుకుంటారు. వారు జీవితంలో సాధించాల్సిన లక్ష్యాలు, ఆశయాలపై కోటి ఆశలతో ఎదురు చూస్తుంటారు. ఏ కష్టమొచ్చినా ఎదురొడ్డి పోరాడేందుకు నా కొడుకు ఉన్నాడని గొప్పగా చెప్పుకుంటుంటారు. అలాంటి సమయంలో రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళిస్తే తల్లిదండ్రుల వేదన వర్ణనాతీతం. వాహనదారులు మితిమీరిన వేగంతో వెళ్తూ ప్రాణాలు కోల్పోతున్న తీరు విషాదం కలిగిస్తోంది.

ఫ్యాషన్.. ప్రమాదాలకు పిలుపు

ఇరవై ఏళ్లు కూడా నిండకుండానే గారాబంతో కొడుక్కి 220 సీసీ బైక్‌ను తల్లిదండ్రులు కొనిస్తారు. బైక్ ఇచ్చారు కదా అని నెమ్మదిగా వెళ్తాడా అంటే అదీ లేదు. మితిమీరిన వేగంతో వెళ్లడం ఎక్కడో ఒక చోట ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోవడం షరా మామూలై పోయింది. అయినా యువకుల తీరులో మార్పు రావడం లేదు. ఇంట్లో ఎంత నచ్చజెప్పి పంపినా రోడ్డుమీదకొచ్చే సరికి ఫ్యాషన్‌తో అతివేగంగా డ్రైవ్ చేస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాల్లో 90 శాతం ద్విచక్ర వాహనదారులవే. ఇందులో మృతి చెందుతున్నది 30 ఏళ్ల లోపు యువకులే. ఏడాదికి సగటున 20 మంది రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందుతున్నారు. అధికారులు తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా యువకుల్లో మార్పు రావడం లేదు. యువకులు బైక్, కారు ఎక్కితే చాలు కంటికి కనిపించనంత వేగంతో దూసుకెళ్తున్నారు. ప్రమాదానికి గురై మృతి చెందిన వారిలో ఎక్కువ శాతం హెల్మెట్ లేకుండా వెళ్లిన వారే..

వై జంక్షన్‌లో దీపాలు లేక..

వేటపాలెం బైపాస్ రోడ్డు లో ప్రధానంగా అక్కాయిపాలెం, చల్లారెడ్డిపాలెం, వేటపాలెం, రామన్నపేట వై జంక్షన్ వద్ద రాత్రి వేళల్లో వీధిలైట్లు లేక పోవడంతో ఎక్కువ ప్రమాదాలు చేసుకుంటున్నాయి. దీని సంబంధిత పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు

ఇటీవల జరిగిన కొన్ని ప్రమాదాలు..

- మూడు రోజుల కిందట బైపాస్ రోడ్డులో రాజీవ్ స్వగృహ దగ్గరలో ఒంగోలు వేపు నుంచి అతి వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న తండ్రి, తల్లి, ఇద్దరు కూతుళ్లు ప్రమాదం బారిన పడ్డారు. ఈఘటనలో 13 ఏళ్ల చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. తల్లి, తండ్రి, పెద్ద కూతురు తీవ్రగాయాలపాలయ్యారు.
- రెండు రోజుల కిందట బైపాస్ రోడ్డులో వేటపాలెం వైజంక్షన్ వద్ద రోడ్డు దాటుతున్న దున్నపోతులను బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు తీవ్రగాయాలపాలయ్యారు.
- నాలుగు నెలల కిందట బైపాస్ రోడ్డులో అక్కాయిపాలెం జంక్షన్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న బైక్‌ను వేగంగా వచ్చి కారు ఢీకొట్టడంతో బైక్ నడుపుతున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు.
- బైపాస్ రోడ్డులో చల్లారెడ్డిపాలెం జంక్షన్ వద్ద రోడ్డు క్రాస్ చేస్తున్న బైక్‌ను వేంగా వచ్చిన మినీ లారీ ఢీకొట్టడంతో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే జైలుకే..

పాతికేళ్ల కుర్రాళ్లు అవగానే కుటుంబానికి అండగా నిలవాల్సిన వారు, జీవితంలో ఎన్నో సాధించాల్సిన వయస్సులో ఇలా నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి ప్రాణాల మీదకు తెచ్చుకోవడం బాధాకరం. మైనర్లకు తల్లిదండ్రులు బైకులు ఇవ్వరాదని సూచిస్తున్నాం. ప్రమాదాల నియంత్రణకు వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నాం. హెల్మెట్ లేని వారికి జరిమానాలు విధిస్తున్నాం.

– ఎం. వెంకటేశ్వర్లు, ఎస్సై, వేటపాలెం

పార్టీ పటిష్టతకు కృషిచేయాలి



నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి హనిమిరెడ్డి

- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి చిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: గ్రామగ్రామాన పార్టీ పటిష్టతకు కృషి చేస్తానని అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. శుక్రవారం అద్దంకి మండలంలోని తిమ్మాయపాలెం గ్రామంలో పర్యటించారు. ఈసందర్భంగా గురువారం వివాహం అయిన నూతన వధూవరులను గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు నర్రా రాఘవరావు కుమారుడు హరికృష్ణ, లలితశ్రీలను ఆశీర్వదించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతూ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి త్వరలో గ్రామాల్లో తాను పర్యటిస్తానన్నారు. ఎవరు అధైర్యపడొవద్దని, తాను అండగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

కారంచేడు: ద్విచక్రవాహనాన్ని కారు బలంగా ఢీకొట్టడంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ప్రమాదం శుక్రవారం సాయంత్రం వాడరేవు–పిడుగురాళ్ల జాతీయ రహదారిలో కారంచేడు– చీరాల మధ్యన పెద చప్టాలు సమీపంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. బాపట్ల సమీపంలోని కొణిజేటివారిపాలెం సుబ్బారావు కారంచేడు వైపు నుంచి చీరాల వైపునకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో చీరాల వైపు నుంచి ఇడుపులపాడు వెళ్తున్న కారు పెద చప్టాలు వద్దకు వచ్చేసరికి బైకును ఢీకొట్టాడు. దీంతో సుబ్బారావు సమీపంలోని పంట కాలువలో పడిపోయాడు. ప్రమాదం జరిగిన తీరును అప్పుడే అటువైపు వెళ్తున్న కారంచేడు ఎంఈఓ ఎం వెంకటేశ్వర్లు గమనించి 108 వాహనానికి సమాచారం అందించారు. విషయం తెలిసిన కారంచేడు ఎస్ఐ వీ వెంకట్రావు వెంటనే ప్రమాద స్థలికి చేరుకుని తన జీపులో చీరాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అపస్మారక స్థితిలో ఉన్న క్షతగాత్రుడిని మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



పంట కాలువలో పడిపోయిన క్షతగాత్రుడు

ఉపాధి అవకాశాల కల్పనకే గ్రామ సభలు



మార్టూరులో ఉపాధి హామీ సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు



దేశాయిపేట మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

- తూతూ మంత్రంగా గ్రామసభలు

చీరాల టౌన్: మండలంలో ఉన్న గ్రామ పంచాయితీలకు ఎన్నికలు జరగకపోవడంతో ప్రత్యేకాధికారుల పాలనలోనే పంచాయితీలు నడుస్తున్నాయి. ఈ దశలో ఏ కార్యక్రమం చేపట్టిన కనీసం గ్రామ ప్రజలు సైతం అరకొరగా కూడా హాజరుకాని పరిస్థితి. అయితే టీడీపీ, అట్టహాసంగా కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్రామసభలు మొత్తం టీడీపీ నాయకులతోనే నిండిపోయాయి. గ్రామ, మండల స్థాయి, నియోజకవర్గంలోని ఇతర ప్రాంతాల నాయకులను స్టేజీలపై కూర్చోబెట్టి మొక్కుబడిగా సభలు నిర్వహించారు. కేవలం టీడీపీ నాయకుల బలాలు, సినిమా డైలాగులకు నవ్వులు, తదితర ప్రసంగాలు తప్ప గ్రామాభివృద్ధికి చేపట్టాల్సిన అంశాలపై చర్చించిన దాఖలాలు లేవు. గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పథంలో నడిపించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి చేస్తుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని గవినివారిపాలెం, కావూరివారిపాలెం, పిట్టువారిపాలెం, వేటపాలెం మండలం దేశాయిపేట పంచాయతీ గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

కారంచేడు/మార్టూరు/చినగంజాం: ప్రజల ఉపాధి అవకాశాల కల్పనకే గ్రామ సభలు ఉపయోగపడాలని కొత్తపాలెం గ్రామ సర్పంచ్ ఆసోది బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని 12 పంచాయతీలలో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు ఉపాధి పనులు కల్పించేందుకు గ్రామ సభలు నిర్వహించారు.



కొత్తపాలెం పంచాయతీ గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ బ్రహ్మానందరెడ్డి

- కారంచేడు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించారు. మండలంలోని 14 గ్రామాల పరిధిలో నిర్వహించిన గ్రామ సభలకు ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతలో, ప్రత్యేక నోడల్ అధికారుల సమక్షంలో గ్రామస్తులు పనులు గుర్తించేందుకు ఈ సభలు నిర్వహించారు.
- మార్టూరు, దర్శి గ్రామ సభల్లో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పాల్గొని మాట్లాడారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాలలో లింకు రోడ్లు అంతర్గత రోడ్లు, డ్రైనేజీ, త్రాగునీటి పథకాలు తో పాటు ఉద్యాన పంటల అభివృద్ధికి కృషి చేస్తామని ఆయన అన్నారు.

భావితరాలకు ఆదర్శం ప్రకాశం పంతులు



నందిగుంటపాలెంలో ప్రకాశం పంతులుకు నివాళులర్పిస్తున్న విద్యార్థులు



ఇంకొల్లులో ప్రకాశం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

- వేడుకగా ప్రకాశం పంతులు జయంతి

చీరాల అర్బన్/చీరాల టౌన్: నిజాయితీ, నిరాడంబర రాజకీయాలకు ప్రతిరూపంగా నిలిచిన ఆంధ్రరాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన సేవలు భావితరాలకు ఆదర్శమని తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి పురస్కరించుకుని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ప్రకాశం పంతులు చిత్రపటానికి మండల అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ జాతీయ ఉద్యమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించడంతో పాటు నిజాయితీగా రాజకీయాలు చేసిన వ్యక్తి అని పేర్కొన్నారు. యువత ప్రకాశం పంతులును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేష్, రీసర్వే డీటీ అర్జున్, ఆర్ఐ సీహెచ్ శేఖర్, వీఆర్వోలు, వీఆర్ఏలు ఉన్నారు. అలానే ఉపఖజానా కార్యాలయంలో ఎస్టీవో భాగ్యలక్ష్మీ, ఉద్యోగులు ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చీరాల పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ డి.ధనమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనకు కృషి టంగుటూరి

కారంచేడు/చినగంజాం/మార్టూరు/యద్దనపూడి: రాష్ట్ర సాధన కోసం కృషి చేసిన వ్యక్తులలో ప్రముఖ పాత్ర పోషించిన టంగుటూరి ప్రకాశంను ప్రతి ఆంధ్రుడు గుర్తించుకోవాల్సిన అవసరం ఉందని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పిడవర్తి పేరిరెడ్డి అన్నారు. ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు.

- మండల కేంద్రం కారంచేడు ఎంఆర్‌సీలో ఎంఈవో ఎంవీ సత్యన్నారాయణ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు జయంతి వేడుకల్లో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని నందిగుంటపాలెం ప్రాథమిక పాఠశాలలో పంతులుకు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, నాగమణి, పుష్పలత, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.
- ఇంకొల్లు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎం ప్రమీల ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ డీటీ బీ లక్ష్మీకుమారి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అద్దంకితో ఆంధ్రకేసరికి అనుబంధం..

అద్దంకి: ఆంధ్రకేసరికి అద్దంకిలో బంధువులున్నారని.. ఆయన చిన్నతనంలో అద్దంకిలోని ప్రకాశం ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నారని ఎంఈవో బీ సుధాకర్ అన్నారు. ప్రకాశం పంతులు జయంతిని మండలంలోని చక్రాయపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం కారుసాల వీరాంజనేయులు, ఉపాధ్యాయులు సీఆర్పీ రమేష్ పాల్గొన్నారు.

అద్దంకి రూరల్/జే. పంగులూరు: మండలంలోని చందలూరులో జరిగిన గ్రామసభలో మండల విద్యాశాఖాధికారి జీ. వీరాంజనేయులు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, పంచాయతీ సెక్రటరీ వందనం తదితరులు పాల్గొన్నారు.

- అద్దంకి శాఖా గ్రంథాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ చుండూరి సుగుణరావు ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సందిరెడ్డి శ్రీనివాసరావు, విశ్రాంత ఆర్జేడీ యు. దేవపాలన, దివాకరదత్తు, రఫీ, సాయి పాల్గొన్నారు.



చీరాలలో టంగుటూరికి నివాళులర్పిస్తున్న తహసీల్దార్ గోపీకృష్ణ



అద్దంకిలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న లైబ్రేరియన్



చక్రాయపాలెంలో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఈవో



పంగులూరు గ్రామసభలో ప్రసంగిస్తున్న ఎంఈవో

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

చీరాల అర్బన్: జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శుక్రవారం చీరాల రూరల్ మండలం ఈపూరుపాలెంలోని యువజన గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి హాజరయ్యారు. కార్యక్రమానికి విశ్రాంత డీఆర్‌డీఓ శాస్త్రవేత్త అందె మురళీవరప్రసాదరావు అధ్యక్షత వహించి ఈపూరుపాలెం యువజన గ్రంథాలయ సేవలను వివరించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

చీరాల రూరల్: మహిళా వైద్యురాలిపై లైంగికంగా దాడిచేసి ఆపై ఆమెను అతి కిరాతకంగా హతమార్చిన నిందుతులను కఠినంగా శిక్షించాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. కలకత్తాలో మహిళా వైద్యురాలు హత్యాచారనికి నిరసనగా శుక్రవారం చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గౌరవ రమేష్‌బాబు, సీనియర్ న్యాయవాదులు బండారుపల్లి హేమంత్‌కుమార్, టీజె. సాయిబాబు, పీఎన్ఎల్‌వీ ప్రసాద్‌లు మాట్లాడారు. ఈఘటనలో ఉద్దేశపూర్వకంగా వ్యవహరించిన స్థానిక పోలీసులు క్రైమ్ జరిగిన సీన్‌ను మార్చేందుకు చేసిన ప్రయత్నాలను వారు తప్పుపట్టారు. పోలీసులు, వైద్యశాల సిబ్బంది వ్యవహరించిన తీరుపై అనుమానాలను వ్యక్తం చేశారు. బాధితురాలి కుటుంబానికి తక్షణమే న్యాయ సహాయంతో పాటు అన్ని రకాలుగా ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రాజు వెంకటేశ్వరరెడ్డి, మిక్కిలి పుల్లయ్య, బొనిగల జయసన్‌బాబు, సజ్జా శ్రీనివాసరావు, గోలి బాలప్రసాద్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం

చినగంజాం: మండలంలోని పెదగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2023–24లో మెరిట్ సాధించిన విద్యార్థులకు పెదగంజాం ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు నగదు ప్రోత్సాహకం అందజేశారు. శుక్రవారం పాఠశాల హెచ్‌ఎం ఎం దేవదత్తం అధ్యక్షతని నిర్వహించిన కార్యక్రమంలో నగదును విద్యార్థులకు అందజేశారు. మెరిట్ విద్యార్థులు మరుప్రోలు బిందుశ్రీ రూ.5 వేలు, ఎం ఉమామహేశ్వరి రూ.4 వేలు, వడ్లమూడి పావని రూ.3 వేలు, వడ్లమూడి సాయిదివ్య రూ 3 వేలు అందజేయడంతో పాటు ఈ విద్యాసంవత్సరంలో మాచవరపు రవికుమార్‌కు రూ.1,116లు అందజేశారు. మొత్తం రూ.15 వేలు నగదును విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఆసోది బ్రహ్మానందరెడ్డి, పుట్టా చెంచారెడ్డి, ఆసోది దశరథరామిరెడ్డి, కుక్కల అంకిరెడ్డి, కుక్కల వెంకటేశ్వరరెడ్డి, ఆసోది వెంకట రమణారెడ్డి, ఆసోది అంజిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఇంద్ర ఏసీ బస్సులు ప్రారంభం

చీరాల అర్బన్: ఆర్టీసీ చీరాల డిపోలో నూతనంగా రెండు ఇంద్ర ఏసీ సర్వీసుల ప్రారంభ కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జె.శ్యామల శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల స్థానిక బస్టాండ్ ఆవరణలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. నూతన ఇంద్ర సర్వీసులను హైదరాబాద్‌కు నడపనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమానికి అందరూ హాజరు కావాలన్నారు.